## బహదూర్‌పురా తహసీల్దార్‌గా బాల శంకర్



దూద్‌బౌలి: విద్యార్థులకు కుల, ఆదాయ, నివాస ధ్రువీకరణ పత్రాల జారీలో ఎలాంటి జాప్యం లేకుండా చూస్తామని బహదూర్‌పురా తహసీల్దార్ కె.బాల శంకర్ అన్నారు. తహసీల్దార్‌గా శుక్రవారం ఆయన బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ..కార్యాలయానికి వచ్చే ప్రజలకు ఇబ్బంది కలగకుండా సిబ్బంది అందుబాటులో ఉండేలా చర్యలు చేపడుతామన్నారు. ముఖ్యంగా దళారీ వ్యవస్థకు ఆస్కారం లేకుండా చూస్తామన్నారు. కల్యాణలక్ష్మి, షాదీముబారక్ పథకానికి సంబంధించి క్షేత్రస్థాయిలో సిబ్బంది ఎప్పటికప్పుడు దరఖాస్తులను పరిశీలిస్తారన్నారు.

## బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలి



మాట్లాడుతున్న గోషామహల్ ఏసీపీ సుదర్శన్

అబిడ్స్: బక్రీద్‌ను ప్రశాంతంగా నిర్వహించుకోవాలని గోషామహల్ ఏసీపీ ఎస్.సుదర్శన్ పేర్కొన్నారు. శుక్రవారం మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్‌లో పలు మజీద్ కమిటీల సభ్యులు, బీఫ్ దుకాణాల వ్యాపారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఏసీపీ ఎస్.సుదర్శన్ మాట్లాడుతూ..ప్రభుత్వ నిబంధనల ప్రకారం బీఫ్ దుకాణాల వారు వ్యాపారాలు సాగించాలన్నారు. నిబంధనలను అతిక్రమిస్తే కఠినంగా వ్యవహరిస్తామన్నారు. స్లాటర్ హౌజ్ నిబంధనల ప్రకారమే అంతా నడుచుకోవాలన్నారు. మజీద్ కమిటీలు బక్రీద్ సందర్భంగా స్థానికులకు అవగాహన కల్పించాలన్నారు. ప్లాస్టిక్ కవర్లలో వేస్టేజ్ వేసి డస్ట్‌బిన్లలో వేయాలని ఆయన సూచించారు. స్థానిక బస్తీలు, ప్రాంతాల్లో బక్రీద్ రోజు ఎలాంటి వ్యర్థపదార్థాలు రోడ్లపై పడవేయవద్దని ఏసీపీ సుదర్శన్ అన్నారు. ఈ కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ మహేష్ గౌడ్, క్రైమ్ ఇన్‌స్పెక్టర్ మహేందర్, ఎస్ఐ.అస్లామ్ తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన వేసవి శిక్షణ శిబిరం



వేడుకలకు హాజరైన కేంద్ర ప్రభుత్వ ఐసీఏఆర్ సభ్యుడు గోపాల్‌జీ

జియాగూడ: చిన్ననాటి నుంచే ఆటలపై శిక్షణ ఇచ్చినట్లయితే భవిష్యత్తులో క్రీడల్లో రాణిస్తారని ఇండియన్ కౌన్సిల్ అగ్రికల్చరల్ రిసెర్చ్ సభ్యుడు డి.గోపాల్‌జీ అన్నారు. దుర్గానగర్‌లోని భారత అభ్యుదయ ఉన్నత పాఠశాల ప్రాంగణంలో భాషా సాంస్కృతిక శాఖ తెలంగాణ ప్రభుత్వం, నాయికా సంస్కృతిక సంస్థల సంయుక్త ఆధ్వర్యంలో మహారాష్ట్ర మర్దాని ఖేల్ కర్రసాము, కత్తిసాము, బల్లెం, ఆత్మరక్షణ శిక్షణలను ఈ వేసవి శిక్షణ శిబిరం ఇచ్చారు. శుక్రవారం రాత్రి ముగింపు వేడుకలను సంస్థ అధ్యక్షుడు డి.సురేష్ నేతృత్వంలో ఏర్పాటు చేసిన కార్యక్రమానికి ఆయన హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా భారత అభ్యుదయ శిక్షా సమితి కార్యదర్శి కె.కమల్ ప్రసాద్ మాట్లాడుతూ..ప్రతి యేటా వేసవి శిక్షణ శిబిరాలను నిర్వహించి చిన్నారులను ప్రోత్సహించడం అభినందనీయమన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జియాగూడ మాజీ అధ్యక్షుడు లక్ష్మీనారాయణ, రాజ్‌పాల్, డి.హరికిషన్, జి.రమేష్, జి.సాయికుమార్, గణేష్, ఎన్.విశ్వనాథ్ పాల్గొన్నారు.

## వీర్ సావర్కార్ నేటి యువతకు ఆదర్శం



మాట్లాడుతున్న సురేష్ కొచ్చాటిల్

గోల్కొండ: వీర్ సావర్కార్ నేటి యువతకు ఆదర్శమని మోటివేషనల్ స్పీకర్ సురేష్ కొచ్చాటిల్ అన్నారు. స్వాతంత్ర వీర్ సావర్కార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో శుక్రవారం గుడిమల్కాపూర్‌లోని కృష్ణ భవన్‌లో వీర్ సావర్కార్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..వీర్ సావర్కార్ ఆలోచనలు పూర్తిగా దేశభక్తిపైనే ఉండేవని నిజమైన దేశభక్తుడని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో విశ్వహిందూ పరిషత్ రాష్ట్ర అధ్యక్షుడు రామరాజు, నేషనల్ మందిర్ మార్ట్ కో ఆర్డినేటర్ జోన్నకుంటి మధుసూదన్, గోదా లక్ష్మీకాంత్‌యాదవ్, అసోసియేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

## ప్రార్థనలు ప్రశాంతం



శాలిబండ: మక్కా మసీదులో శుక్రవారం సామూహిక ప్రార్థనలు ప్రశాంతంగా జరిగాయి. ఈ సామూహిక ప్రార్థనల్లో మాజీ కార్పొరేటర్ మోసిన్ బలాలలు పాల్గొన్నారు. ప్రార్థనల సందర్భంగా పోలీసులు గట్టి బందోబస్తు ఏర్పాటు చేశారు.

# సమస్యలను పరిష్కరించండి సారూ..

- మేకలమండి గేట్ నుంచి కేసరి హనుమాన్ వరకు అధ్వానంగా రహదారి
- పొంగిపొర్లుతున్న డ్రైనేజీ, పేరుకుపోతున్న చెత్తాచెదారం
- ఇబ్బందులు పడుతున్న స్థానికులు
- పట్టించుకోని అధికారులు





మేకలమండి నుంచి కేసరి హనుమాన్ వరకు గల నాలా మ్యాన్‌హోళ్ల పైన కప్పులు లేక తెరిచిన దృశ్యాలు

జియాగూడ: జియాగూడ మేకలమండి గేట్ నుంచి కేసరి హనుమాన్ వరకు గల రహదారి సమస్యలతో నెలకొంది. ఏళ్లు గడుస్తున్నా అటు ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ అధికారులు సమస్యలను పరిష్కారం చేయడంలో పూర్తిగా విఫలమయ్యారు. ఈ రహదారి దిగువన పెద్ద నాలా, డ్రైనేజీ పైపులైన్లు తరచూ ఓవర్‌ఫ్లో అవుతోంది. నాలాకు పలు చోట్ల ఏర్పాటు చేసిన మ్యాన్‌హోళ్లకు మూతలు లేవు. తాగునీటి పైపులైన్ల మరమ్మతులు చేయడం లేదని ప్రజలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. రహదారి పలుచోట్ల గుంతలు ఏర్పడడంతో ఆర్‌టీసీ బస్సులు సైతం ఈ దారి గుండా వెళ్లకుండా 100 ఫీట్ల జాతీయ రహదారి గుండా వెళ్తున్నాయని స్థానికులు పేర్కొన్నారు.



సత్యనారాయణనగర్‌కు వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్త

### డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యతో ఇబ్బందులు..



ఈ రహదారిలో ఉన్న సమస్యలు తీరాయి అన్న రోజు లేదు. ఎప్పుడు డ్రైనేజీ నిండడం రోడ్లపైన పారడం సర్వసాధారణం. ఇక నాలా పనులు నెలల తరబడి కొనసాగాయి. నాలా మ్యాన్‌హోళ్ల పైన మూతలు బిగించలేదు. ఎప్పుడు వర్షాలు పడ్డా వాహనదారులు అందులో వాహనాలతో సహాపడుతున్నారు. ఈ రహదారిలో సత్యనారాయణనగర్ కాలనీ ఉంది. బస్తీ ఎంట్రన్స్ వద్దే గుట్టల కొద్ది చెత్తాచెదారం, డ్రైనేజీ ఓవర్‌ఫ్లో సమస్యల కారణంగా బస్తీవాసులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. – జగదీష్ యాదవ్, కార్ శిక్షకుడు, జియాగూడ

### ఎవరూ పట్టించుకోవడం లేదు..



మేకల మండి గేట్ నుంచి కేసరి హనుమాన్ ఆలయం వరకు గల దారి మురుగు, చెత్త తదితర సమస్యలు 30 ఏళ్ల నుంచి చూస్తున్నాం. ఎవరూ పట్టించుకోవడం లేదు. ఇకనైనా అధికారులు, ఎమ్మెల్యే సందర్శించాలి. – శివకుమార్ యాదవ్, 2జి బస్‌స్టేషన్

## చిన్నారులను శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలి




నాట్య గురువులకు పురస్కారాలను అందజేస్తున్న దైవాజ్ఞశర్మ, తేజావత్ రామ్‌దాస్ తదితరులు

గన్‌ఫౌండ్రీ: నేటి తరం చిన్నారులను కూచిపూడి భరతనాట్యం వంటి శాస్త్రీయ కళల్లో ప్రోత్సహించాలని పలువురు ప్రముఖులు సూచించారు. శుక్రవారం రవీంద్రభారతిలో బి9 డ్యాన్స్ స్టూడియో ఆధ్వర్యంలో భారతీయ సంస్కృతి సకల కళా పురస్కారాలను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా కూచిపూడి, భరతనాట్యం, జానపద గీతాలతో పాటు వెస్ట్రన్ పాటలతో చిన్నారులు సందడి చేశారు. అనంతరం నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ తేజావత్ రామ్‌దాస్ మాట్లాడుతూ..చిన్నారులకు మన వారసత్వ సంపద అయిన శాస్త్రీయ సంగీత కళలను నేర్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందన్నారు. పలువురు నాట్య గురువులను సత్కరించగా చిన్నారులను అభినందించారు. ఈ కార్యక్రమంలో సరస్వతి ఉపాసకులు దైవాజ్ఞశర్మ, సామాజిక వేత్త జి.శ్రీనివాస్, నటుడు రాజ్‌కమల్, నాట్య గురువు సావరి సంజీవని, డ్యాన్స్ స్టూడియో వ్యవస్థాపకులు బన్ని జాక్సన్ తదితరులు పాల్గొన్నారు.

## ప్రింటింగ్ టెక్నాలజీని సద్వినియోగం చేసుకోవాలి



అనురాధ

శాలిబండ: ప్రింటింగ్ టెక్నాలజీలో ఉపాధి అవకాశాలు పుష్కలంగా ఉన్నాయని వీటిని విద్యార్థులు సద్వినియోగం చేసుకోవాలని ప్రింటింగ్ టెక్నాలజీ నిపుణురాలు అనురాధ అన్నారు. పాతబస్తీలోని కులీ కుతుబ్ షా పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఆమె విలేకర్లతో మాట్లాడుతూ..పదో తరగతి తర్వాత పాలిటెక్నిక్ ఎంట్రెన్స్ ఉత్తీర్ణులైన విద్యార్థులు ఈ ప్రింటింగ్ టెక్నాలజీ కోర్సు కలిగిన ఏకైక కళాశాల తెలంగాణలోని కులీ కుతుబ్ షా కళాశాలలో ఉందన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీ మూడేళ్ల డిప్లొమా చేసిన వారికి ఎక్కువగా ఉపాధి అవకాశాలు ఉన్నాయన్నారు. ప్రింటింగ్ టెక్నాలజీలో డిప్లొమా చేసిన వారు సీసీఐ, మోడికోర్, ఎలెనిక్స్, ఆర్బీఐ మీడియా వంటి ప్రింటింగ్ సంస్థల్లో మంచి జీతం గల ఉద్యోగాలు పొందే అవకాశం ఉందన్నారు. డిజిటల్ ప్రింటింగ్ రంగంలో డిజైనింగ్, గ్రాఫిక్స్ వంటి విభాగాల్లో ఉద్యోగ అవకాశాలున్నాయన్నారు. మరిన్ని వివరాలకు జూపార్కు సమీపంలోని కులీ కుతుబ్‌షా కళాశాలలో సంప్రదించాలన్నారు.

## కలిసికట్టుగా పని చేస్తే సత్ఫలితాలు



మాట్లాడుతున్న ఏసీపీ సయ్యద్ ఫయాజ్

గోల్కొండ: అందరూ కలిసికట్టుగా పని చేస్తేనే సత్ఫలితాలు వస్తాయని టోలిచౌకీ ఏసీపీ సయ్యద్ ఫయాజ్ అన్నారు. శుక్రవారం ఆయన గోల్కొండలోని తన కార్యాలయంలో గోల్కొండ పీస్ కమిటీ, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన వచ్చే నెలలో జరగనున్న గోల్కొండ బోనాల విషయంపై చర్చించారు. పీస్ కమిటీ, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ సభ్యులందరూ స్థానికులతో కలిసి బోనాలను విజయవంతం చేస్తున్నారని మునుముందు కూడా ఇదే పరంపర కొనసాగించాలన్నారు. త్వరలోనే దేవాదాయ శాఖ, బల్దియా, పోలీసులు, జలమండలి అధికారులతో గోల్కొండ కోట బోనాల ఏర్పాట్లపై సమీక్షా జరుగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ మౌజంఖాన్, గోల్కొండ పీస్ కమిటీ చైర్మన్ ఎస్.రాజుపస్తాద్, సెంట్రల్ పీస్ అండ్ వెల్ఫేర్ కమిటీ కార్యదర్శి కౌసరుద్దీన్, ఇలియాస్ ఆలీ, ఆబేద్, షానవాజ్‌ఖాన్, గోల్కొండ ఇన్‌స్పెక్టర్ బి.సైదులు, డీఐ రాజేంద్రప్రసాద్ తదితరులున్నారు.

## సమన్వయంతో నాలా పనులు పూర్తి చేయాలి



యాకుత్‌పురాలో పర్యటిస్తున్న కమిషనర్ కర్ణన్, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీ, జలమండలి ఎండీ

యాకుత్‌పురా: అధికారులు సమన్వయంతో నాలా అభివృద్ధి పనులు పూర్తి చేయాలని జీహెచ్‌ఎంసీ కమిషనర్ ఆర్.వి కర్ణన్ ఆదేశించారు. ఎమ్మెల్యే జాఫర్ హుస్సేన్ మేరాజ్, ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫాందీ, జలమండలి ఎండీ అశోక్‌రెడ్డి, జీహెచ్‌ఎంసీ చార్మినార్ జోనల్ కమిషనర్ వెంకన్నతో కలిసి శుక్రవారం ఆయన యాకుత్‌పురా, గంగానగర్ నాలా, మౌలా కా చిల్లా, జహంగీర్ నగర్ ప్రాంతాల్లో కొనసాగుతున్న నాలా విస్తరణ పనులను పరిశీలించారు. జహంగీర్‌నగర్ నుంచి మౌలా కా చిల్లా వరకు డ్రైనేజీ పైపులైన్ పనులు చేపట్టాలని కార్పొరేటర్ సోహెల్ ఖాద్రీ కమిషనర్‌కు వివరించగా పనులకు సంబంధించిన ప్రతిపాదనలు సిద్ధం చేయాలని అధికారులకు సూచించారు. ఈ సందర్భంగా కమిషనర్ మాట్లాడుతూ..యాకుత్‌పురాలో కొనసాగుతున్న నాలా పనుల్లో వేగం పెంచి సాధ్యమైనంత త్వరగా పూర్తిచేయాలన్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ..రానున్న వర్షాలకు వరద నీటి సమస్యలు రాకుండా నాలా పనులు పూర్తి చేయాలని కమిషనర్ దృష్టికి తీసుకెళ్లామన్నారు. ఎమ్మెల్సీ మీర్జా రియాజుల్ హసన్ అఫాందీ మాట్లాడుతూ..బక్రీద్ సందర్భంగా పారిశుద్ధ్య సమస్యలు తలెత్తకుండా ప్రతి ఇంటికి గార్బేజ్ కవర్లను పంపిణీ చేసి ఎప్పటికప్పుడు చెత్త తరలింపు చర్యలు తీసుకోవాలని కమిషనర్‌ను కోరారు. ఈ పర్యటనలో కార్పొరేటర్లు సమీనా బేగం, సయ్యద్ సోహెల్ ఖాద్రీ, మహ్మద్ వసీవుద్దీన్, అలందార్ వాలాజాహి, నస్రీన్ సుల్తానా, ఎస్ఈ మహేశ్వర్‌రెడ్డి, సంతోష్‌నగర్ డీసీ మంగతాయారు పాల్గొన్నారు.

## తెలంగాణ సంస్కృతికి ప్రతీక బోనాలు



తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ నిరంజన్‌తో చంటిబాబు తదితరులు

గోల్కొండ: తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు అని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ జి.నిరంజన్ అన్నారు. గోల్కొండ జగదాంబిక మహంకాళి బోనాల జాతర ఉత్సవ కమిటీ సభ్యులు శుక్రవారం ఆయనను కలిశారు. ఈ సందర్భంగా ఆయన ఆలయ బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ నిరంజన్‌ను శాలువా కప్పి అభినందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ..బోనాలను కాంగ్రెస్ ప్రభుత్వం వైభవంగా నిర్వహించేందుకు అన్ని ఏర్పాట్లు చేస్తుందన్నారు. వందల ఏళ్ల చరిత్ర గల గోల్కొండ కోటలో బోనాలు నిర్వహించడం దేశానికే కిరీటం అని ఆయన అన్నారు. ఈ కార్యక్రమంలో బోనాల నిర్వహణ కమిటీ చైర్మన్ కె.చంటిబాబు, శ్రీకాంత్, సంతోష్‌గౌడ్, అనిత, కుమార్, యాదగిరి తదితరులున్నారు.

## ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల కార్యదర్శిపై చర్యలు తీసుకోవాలి



మాట్లాడుతున్న మన్నె శ్రీధర్ రావు

నాంపల్లి: ఎస్సీ, ఎస్టీ గురుకుల విద్యాలయాల్లోని విద్యార్థులతో బాత్రూమ్‌లను కడిగిస్తున్నారని అంబేడ్కర్ సేన జాతీయ అధ్యక్షుడు మన్నె శ్రీధర్ రావు ఆరోపించారు. శుక్రవారం ఆయన ఏసీ గార్డ్స్‌లోని యేట్నారి టవర్స్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో మాట్లాడారు. గురుకులాల్లో ఎస్సీ, ఎస్టీ విద్యార్థులతో మరుగుదొడ్లను శుభ్రం చేయించడం శోచనీయమన్నారు. విద్యార్థులతో బాత్రూమ్‌లను కడిగించడమే కాకుండా వారి మరుగుదొడ్లు వారే కడిగితే తప్పేంటని గురుకులాల కార్యదర్శి అలుగు వర్షిణి వ్యాఖ్యలు చేయడాన్ని తీవ్రంగా ఖండించారు. 48 గంటల్లో ఆమెపై ప్రభుత్వం చట్టపరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో జైభీమ్ సేఫైట్ ఫర్ రైట్స్ వ్యవస్థాపకులు పి.బల్వంతరావు, ఆలిండియా అంబేడ్కర్ యువజన సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కాడా రామ్ వినయ్‌కుమార్, అంబేడ్కర్ సేన రాష్ట్ర ఉపాధ్యక్షుడు శాతిరి ప్రవీణ్‌కుమార్ పాల్గొన్నారు.

## ఎన్టీఆర్ అవార్డుల ప్రదానం



హీరో కృష్ణసాయికి అవార్డును అందజేస్తున్న ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి

గన్‌ఫౌండ్రీ: తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో సత్య సంగీత ఇంటర్నేషనల్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో పలువురు ప్రముఖులకు ఎన్టీఆర్ అవార్డులను శుక్రవారం రవీంద్రభారతిలో అందజేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ ఎస్.మధుసూదనాచారి మాట్లాడుతూ..సామాజిక సేవలు చేస్తున్న నటుడు కృష్ణ సాయికి ఎన్టీఆర్ అవార్డు ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందన్నారు. ప్రతి ఒక్కరూ సామాజిక సేవా దృక్పథం కలిగి ఉండాలని సూచించారు. నటుడు కృష్ణసాయి మాట్లాడుతూ..తన సేవలను గుర్తించి అవార్డును ఇవ్వడం ఎంతో ఆనందంగా ఉందని కృష్ణసాయి ఇంటర్నేషనల్ చారిటబుల్ ట్రస్ట్ ద్వారా నిరంతరం సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని తెలిపారు. అంతకు ముందు గాయని గాయకుల గీతాలాపన ఆహుతులను ఆకట్టుకుంది. కార్యక్రమంలో నగర ట్రాఫిక్ అడిషనల్ డీసీపీ రాందాస్ తేజావత్, హైకోర్టు న్యాయవాది కనకదుర్గ తదితరులు పాల్గొన్నారు.

## ఉద్యోగుల సంక్షేమానికి నిరంతర కృషి



కార్యక్రమంలో కేఆర్.రాజ్‌కుమార్, భాస్కర్ తదితరులు

అబిడ్స్: స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో దీర్ఘకాలంగా ఉన్న ఉద్యోగుల సమస్యలను పరిష్కరిస్తూ వారికి అండగా ఉంటున్నామని టీఎన్జీఓస్ యూనియన్ స్కూల్ ఎడ్యుకేషన్ హైదరాబాద్ ప్రెసిడెంట్ కేఆర్.రాజ్‌కుమార్, కార్యదర్శి ఎం.భాస్కర్ పేర్కొన్నారు. శుక్రవారం విద్యాశాఖలోని పదవీ విరమణ పొందిన సీనియర్ అసిస్టెంట్లు సురేష్, జాఫర్ అల్తాఫ్‌కు యూనియన్ తరపున వీడ్కోలు సమావేశం నిర్వహించారు. వారిని ఘనంగా సత్కారం చేసి అభినందించారు. అనంతరం రాజ్‌కుమార్, భాస్కర్ మాట్లాడుతూ..ఉద్యోగులందరూ 30 ఏళ్లకు పైగా తమ విధులు నిర్వహించడం ఎంతో గర్వకారణమన్నారు. స్కూల్ ఎడ్యుకేషన్ డిపార్ట్‌మెంట్‌లో ఉద్యోగులు ఎలాంటి సమస్యలు ఉన్నా తమ దృష్టికి తెస్తే కేంద్ర సంఘం అధ్యక్షుడు మారం జగదీశ్వర్, ప్రధాన కార్యదర్శి ముజీబ్ హుస్సేన్ దృష్టికి తీసుకువచ్చి పరిష్కారం చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో విజయలక్ష్మి, ప్రవీణ, చంద్రశేఖర్‌రెడ్డి, శ్రీకాంత్, రాజేందర్ రెడ్డి, రామకృష్ణారెడ్డి, ఖనీజ్ ఫాతీమా, ఉమాదేవి, మంజు, నర్సింహా, శ్రీధర్, శ్రీకాంత్, సరస్వతి, అర్చన సుకన్య పాల్గొన్నారు.

## డోలక్ కృష్ణ సేవలు మరువలేనివి



డోలక్ కృష్ణ (ఫైల్)

జియాగూడ: సాంస్కృతిక రంగానికి, సామాజిక సేవా కార్యక్రమాలకు డోలక్ కృష్ణ చేసిన సేవలు మరువలేనివని తెలంగాణ రాష్ట్ర కురుమ సంఘం అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్సీ యెగ్గె మల్లేశం కురుమ పేర్కొన్నారు. జియాగూడలో బుధవారం, శ్రీరంగనాథ సేవా సమితి కల్చర్ అసోసియేషన్ మాజీ అధ్యక్షుడు, తెలుగు బుక్ ఆఫ్ రికార్డు గ్రహీత, కురుమ సంఘం నాయకుడు డోలక్ కృష్ణ(73) అనారోగ్యంతో, ఆయన నివాసంలో తుది శ్వాస విడిచారు. పార్థివ దేహాన్ని యెగ్గే మల్లేశం, ప్రధాన కార్యదర్శి బండారు నారాయణ, సెక్రెటరీ కొలువుల నరసింహ, కోశాధికారి కట్ట మల్లేశం, జియాగూడ కార్పొరేటర్ బోయిని దర్శన్, రాష్ట్ర ఆర్టీసీ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ హైదరాబాద్ రీజియన్ అధ్యక్షులు పూస నరసింహ సందర్శించి నివాళులర్పించారు.



## ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి



మాలకుంటలో ప్రజా సమస్యలు తెలుసుకుంటున్న ఆనంద్‌కుమార్ గౌడ్

అబిడ్స్: ప్రజా సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని గోషామహల్ నియోజకవర్గ బీఆర్ఎస్ నాయకుడు ఎం.ఆనంద్‌కుమార్ గౌడ్ అన్నారు. మూడుసార్లు గోషామహల్ ఎమ్మెల్యేగా ఎన్నికైన రాజాసింగ్ ప్రజలను ఏ మాత్రం పట్టించుకోవడం లేదని ఆనంద్‌కుమార్ గౌడ్ ఆరోపించారు. శుక్రవారం మాలకుంటలో ఆయన పర్యటించి ప్రజా సమస్యలు తెలుసుకున్నారు. కొన్ని రోజులుగా మాలకుంట బస్తీలో విద్యుత్ సరఫరా కావడం లేదని స్థానికులు ఫిర్యాదు చేయడంతో ఆనంద్‌కుమార్ గౌడ్ పర్యటించి విద్యుత్ అధికారులను రప్పించి విద్యుత్ సమస్యలను పరిష్కరించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ..తాను గత ఎన్నికల్లో ఓటమి చెందినా 24 గంటల పాటు ప్రజలకు అందుబాటులో ఉండి ప్రజా సమస్యలు పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా తన దృష్టికి తీసుకొస్తే గోషామహల్ నియోజకవర్గం నలుమూలలా పర్యటించి వాటర్‌బోర్డు, జీహెచ్‌ఎంసీ, విద్యుత్, ఇతర శాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో అహ్మద్ తదితరులు పాల్గొన్నారు.

## నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

అఫ్జల్‌గంజ్: 11 కేవీ రహీంపురా విద్యుత్ ఫీడర్ పరిధిలోని రహీంపురా, ఖజాగూడ, రహీంపురా సీబీఐ క్వార్టర్స్ తదితర ప్రాంతాల్లో శనివారం ఉదయం 10 నుంచి 10:30 గంటల వరకు విద్యుత్ సరఫరాలో అంతరాయం ఉంటుందని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. అలాగే సీతారామ్ బాగ్ విద్యుత్ ఫీడర్ పరిధిలోని ఆగాపురా నాలా, నమాజ్ గ్రౌండ్స్, హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ తదితర ప్రాంతాల్లో 10 నుంచి 12 గంటల వరకు. ఎన్‌జీడబ్ల్యూ విద్యుత్ ఫీడర్ పరిధిలోని వెంకటేశ్వర కాలనీ, రెడ్డి కాలనీ తదితర ప్రాంతాల్లో 11 నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు సరఫరా ఉండదన్నారు. సుల్తాన్‌బజార్ ఫీడర్ పరిధిలోని సుల్తాన్‌బజార్, ప్రగతి కాలేజీ, కేఎస్ లైన్, హనుమాన్ టేక్డీ తదితర ప్రాంతాల్లో మధ్యాహ్నం 2 నుంచి 3 గంటల వరకు. దత్తాత్రేయ నగర్ అండర్ గ్రౌండ్ కేబుల్ ఫీడర్ పరిధిలోని దత్తాత్రేయనగర్ కాలనీ, కిషన్‌నగర్ తదితర ప్రాంతాల్లో 2 గంటల నుంచి సాయంత్రం 4 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు.

## వృద్ధురాలి అదృశ్యం



జయలక్ష్మి

గోల్కొండ: వృద్ధురాలు అదృశ్యమైన ఘటన టోలిచౌకి పోలీస్‌స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. ఇన్‌స్పెక్టర్ ఎల్.రమేష్‌నాయక్ తెలిపిన వివరాల ప్రకారం..టోలిచౌకీ బాల్‌రెడ్డినగర్‌కు చెందిన జయలక్ష్మి(78) ఈ నెల 29న మధ్యాహ్నం ఇంటి నుంచి బయటకు వెళ్లి తిరిగి రాలేదు. దీంతో కుటుంబ సభ్యులు ఆమె ఆచూకీ కోసం బంధువులు, తెలిసిన వారి వద్ద వాకాబు చేసినా ఫలితం లేకుండా పోయింది. దీంతో కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## పునఃప్రారంభమైన పనులు

సాక్షి, సిటీబ్యూరో: గుడిమల్కాపూర్ పూల మార్కెట్ ప్రాంగణంలోని మెట్ల బావి అభివృద్ధి పనులు పునఃప్రారంభమయ్యాయి. ఏడాదిన్నర క్రితం పనులు ప్రారంభించి అసంపూర్తిగా వదిలేశారు. దీనిపై 'సాక్షి'లో 'అభివృద్ధి అన్నారు..అసంపూర్తిగా వదిలేశారు!'అనే శీర్షికన ప్రచురితమైన వార్తకు అధికారులు స్పందించారు. పురావస్తు శాఖ, జీహెచ్‌ఎంసీ సంయుక్తంగా ఈ పనులను చేపడుతున్నాయి. తాజాగా ఇక్కడ తిరిగి అభివృద్ధి పనులను ప్రారంభించారు. మట్టి తవ్వకాలు జరుగుతున్నాయి.




## ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలి



ట్రాఫిక్ ఏసీపీ ధనలక్ష్మి, ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కౌసర్

గోల్కొండ: ట్రాఫిక్ నియంత్రణకు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఎమ్మెల్యే కౌసర్‌మోహియుద్దీన్ అన్నారు. ట్రాఫిక్ ఏసీపీ డి.ధనలక్ష్మి శుక్రవారం ఎమ్మెల్యేను కలిశారు. ఈ సందర్భంగా ఆమె టోలిచౌకీ, లంగర్‌హౌస్ తదితర ప్రాంతాల్లో ట్రాఫిక్ నియంత్రణకు తాము తీసుకుంటున్న చర్యల గురించి వివరించారు. పలు ప్రాంతాల్లో రోడ్డు మధ్యలో చెట్లు ఉన్నాయని మరికొన్ని ప్రాంతాల్లో ప్రధాన రహదారుల పక్కనే డబ్బాలు, స్టాల్స్ వెలిశాయని దీన్ని వల్ల ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఎమ్మెల్యేకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ..అక్రమ పార్కింగ్‌లు, రోడ్డు కబ్జాల విషయంపై తాను బల్దియా, లా అండ్ ఆర్డర్ పోలీసులు, ట్రాఫిక్ పోలీసులకు తెలిపామన్నారు. పోలీసులు తమ విధులను సక్రమంగా నిర్వహిస్తే ఎవరికి ఎటువంటి ఇబ్బందులు ఉండవన్నారు. హోటల్స్, మాల్స్, ఎదురుగా రోడ్డును ఆక్రమిస్తూ ద్విచక్ర వాహనాల అక్రమ పార్కింగ్‌లు చేస్తున్నారన్నారు. ఇటువంటి అక్రమ పార్కింగ్‌ల నిరోధానికి ఎటువంటి చర్యలు తీసుకున్నారని ఆయన ప్రశ్నించారు. కార్యక్రమంలో టోలిచౌకీ ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ జి.వెంకటేశ్వర్లు ఉన్నారు.

## గుండెపోటుతో గృహిణి మృతి

నాంపల్లి: గుండెపోటుతో గృహిణి మృతి చెందిన ఘటన హబీబ్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని స్వామి దయానంద్‌నగర్ బస్తీలో జరిగింది. పోలీసుల వివరాల ప్రకారం..స్వామి దయానంద్‌నగర్‌కు చెందిన శివ శంకర్ కార్వాన్‌కు చెందిన మానస(23) భార్యాభర్తలు. వీరికి ముగ్గురు పిల్లలు ఉన్నారు. శుక్రవారం ఆమె అస్వస్థతకు గురవ్వడంతో నాంపల్లి ఏరియా ఆసుపత్రికి తరలించారు. అక్కడ నుంచి మెరుగైన చికిత్స కోసం ఓ ప్రైవేట్ ఆసుపత్రికి తీసుకెళ్లారు. ఆసుపత్రిలో చికిత్స పొందే క్రమంలో గుండెపోటు రావడంతో మృతి చెందినట్లుగా పోలీసులు తెలిపారు. మానస మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఉస్మానియా మార్చురీకి తరలించారు. మానస తల్లి ఇచ్చిన ఫిర్యాదుతో పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.